## సహకార సంఘం నూతన పాలకవర్గానికి సన్మానం



**దశ, చౌటుప్పల్:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించింది. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆశీస్సులతో చైర్మన్‌గా మస్తాన్‌బాబు యాదవ్, వైస్ చైర్మన్‌గా పర్ని శివారెడ్డి, డైరెక్టర్‌గా బొబ్బిళ్ల రాజు ముదిరాజ్ నియమితులై బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన బాధ్యులను సన్మానించి ఆత్మీయ శుభాకాంక్షలు తెలిపారు. సహకార సంఘం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి నూతన పాలకవర్గం కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు, అడ్వకేట్ ఉడుగు శ్రీనివాస్ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు పస్తం గంగారాములు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 52వ డివిజన్‌లో గణేష్ పూజల్లో కాంగ్రెస్ నాయకులు కంచర్ల



**దశ, పెద్ద అంబర్‌పేట్ :** పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ 52వ డివిజన్‌లో నిర్వహించిన పలు గణేష్ పూజా కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కంచర్ల సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.


## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**దశ, ఇబ్రహీంపట్నం:** తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారామతిపేట్ గ్రామానికి చెందిన అచ్చిన శ్రీవాణికి రూ.60 వేల చెక్కు, ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన గుండ్ల విక్రమ్‌కు రూ.60 వేల చెక్కు మంజూరైంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో మంజూరైన ఈ చెక్కులను శనివారం మర్రి నిరంజన్ రెడ్డి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందిన ఆర్థిక సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ లీకేజీతో మేక మృతి

❖ *బాధితుడికి నష్టపరిహారం చెల్లించాలి: షేక్ రియాజ్*



**దశ, భువనగిరి :** భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీ 1వ వార్డులో విద్యుత్ లీకేజీ కారణంగా మేక మృతి చెందిన ఘటన కలకలం రేపింది. ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో భూమిలోకి విద్యుత్ లీకేజీ ఏర్పడటంతో మేకకు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఘటనపై విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి కారణాలను పరిశీలించాలని, మేకను కోల్పోయిన యజమానికి నిబంధనల ప్రకారం పూర్తి నష్టపరిహారం అందించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా యువజన అధ్యక్షుడు షేక్ రియాజ్ కోరారు. పట్టణంలోని ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, ఎర్తింగ్ వ్యవస్థలను తనిఖీ చేసి విద్యుత్ లీకేజీలను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మనుషులు, పశువుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు.

# కాంగ్రెస్–బీఆర్‌ఎస్‌ది ఫ్రెండ్లీ ఫైట్: బూర



**దశ, హైదరాబాద్ :** కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య జరుగుతున్న రాజకీయ రగడ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే జరుగుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. ఇరు పార్టీల మధ్య డబ్ల్యూడబ్ల్యూఎఫ్ తరహాలో 'ఫిక్స్‌డ్ మ్యాచ్' జరుగుతోందని విమర్శించారు.
రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విధానం డైవర్షన్, డిస్ట్రక్షన్, డిమాలిషన్‌గా మారిందని బూర ఆరోపించారు. ప్రజా సమస్యలు, ఆరు గ్యారెంటీల అమలు, 22ఏ భూముల సమస్యలపై చర్చ జరగకుండా ప్రభుత్వం ఇతర అంశాలతో ప్రజల దృష్టిని మళ్లిస్తోందన్నారు. కాంగ్రెస్ అసెంబ్లీని మాకరీ చేస్తే.. బీఆర్‌ఎస్ మాక్ అసెంబ్లీలకే పరిమితమైందని వ్యాఖ్యానించారు.
కేసీఆర్ ఫామ్‌హౌస్, హరీశ్‌రావు నివాసాల చుట్టూ మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటనలు రాజకీయ పిక్నిక్‌లుగా మారాయని బూర విమర్శించారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులపై నిజంగా విచారణ చేయాలనుకుంటే క్రిమినల్ కేసులు, పీఎంఎల్‌ఏ కింద దర్యాప్తు ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాలో భూదందాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మునగనూరు పరిధిలోని సర్వే నంబర్లు 44/1, 44/10లో సుమారు రూ.300 కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తి పేరిట బదలాయించారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి విచారణ జరగాలని డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భూ వ్యవహారాలపై భవిష్యత్‌లో విచారణలు చేపడతామని బూర నర్సయ్య గౌడ్ తెలిపారు. భూ కబ్జాలపై సీఐడీ, ఈడీ, సీబీఐ దర్యాప్తు చేయిస్తామని పేర్కొన్నారు.

## వినాయక పండుగలు ఐకమత్యాన్ని పెంచుతాయి



**దశ, చౌటుప్పల్:** వినాయక చవితి వేడుకలు ప్రజల్లో ఐకమత్యం, సామాజిక స్ఫూర్తిని పెంపొందిస్తాయని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, హైకోర్టు న్యాయవాది నర్రి స్వామి అన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను సందర్శించిన ఆయన, చౌటుప్పల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ పూజలో పాల్గొన్నారు. అనంతరం న్యాయవాదులతో కలిసి ఆటపాటల మధ్య గణనాథుడి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు. వినాయక పండుగలు ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకురావడంతో పాటు సామాజిక ఐక్యతకు దోహదం చేస్తాయని నర్రి స్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరి పరమేష్, ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, బాల్యం వెంకటాచలం, మక్తల్ నరసింహ, శ్రీశైలం యాదవ్, సుధాకర్‌రెడ్డి, పరమేష్, వెంకటయ్య, కిరణ్, ఖయ్యూం పాషా, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## సీఎస్సీ కేంద్రం ప్రారంభించిన చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి

**దశ, అబ్దుల్లాపూర్‌మెట్ :** బాట సింగారం రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సీ)ను సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్‌రెడ్డి ప్రారంభించారు. రైతులు, సహకార సంఘం సభ్యులతో పాటు స్థానిక ప్రజలకు పలు ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. సీఎస్సీలో ఆధార్, పాన్, ఓటర్ కార్డు, పాస్‌పోర్ట్ సేవలతో పాటు ప్రయాణ టికెట్ల బుకింగ్, ఉద్యోగ దరఖాస్తులు, వివిధ ఆన్‌లైన్ చెల్లింపులు తదితర సేవలు అందుబాటులో ఉంటాయని జైపాల్‌రెడ్డి తెలిపారు. ప్రజలు, రైతులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ జక్కుల ఐలేష్ యాదవ్, వైస్ చైర్మన్ నార్లకొండ మల్లమ్మ జంగమయ్య యాదవ్, డైరెక్టర్లు మొగుళ్ల చిన్న యాదారెడ్డి, పగిళ్ల బాల్‌రెడ్డి, జగుంట శ్రీనివాస్‌రెడ్డి, ఇటుకల మహేందర్‌రెడ్డి, మేకల రాములు, పురం నరసింహారెడ్డి, మూల రాజేంద్రప్రసాద్, చింతల లక్ష్మమ్మ, కందాడి మైపాల్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు తప్పనిసరిగా అమలు చేయాలి



**దశ, రంగారెడ్డి :** ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఉపాధ్యాయులు అధికంగా ఉన్న పాఠశాలల నుంచి కొరత ఉన్న పాఠశాలలకు వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద ఉపాధ్యాయులను కేటాయించినట్లు తెలిపారు. కేటాయించిన ఉపాధ్యాయులను ప్రస్తుత పాఠశాలల నుంచి రిలీవ్ చేసి, కొత్తగా కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయకుండా ఉపాధ్యాయులను రిలీవ్ చేయని 83 మంది ప్రధానోపాధ్యాయులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సముచిత కారణం లేకుండా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలితే సంబంధిత అధికారులపై నిబంధనల ప్రకారం తదుపరి విభాగీయ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల్లో విద్యాబోధనకు అంతరాయం కలగకుండా ఉపాధ్యాయుల అందుబాటును సమతుల్యం చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించడమే వర్క్ అడ్జస్ట్‌మెంట్ లక్ష్యమని జిల్లా విద్యాశాఖాధికారి స్పష్టం చేశారు.



## మహావతార్ టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నవరాత్రి వేడుకలు

**దశ ఓయూ:** మహావతార్ టీమ్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, నైవేద్యాలు సమర్పించారు. రాత్రివేళ చిన్నారులు ముత్యాల హారతులు చేస్తూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచారు. కార్యక్రమంలో వెంకటేష్‌చారి దంపతులతో పాటు కాలనీ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మీ గణపతి ఆలయంలో ఘనంగా కుంకుమార్చన



❖ *ఐకమత్యానికి ప్రతీకగా వినాయక నవరాత్రి ఉత్సవాలు*

**దశ, పెద్ద అంబర్‌పేట్ :** శ్రీ లక్ష్మీ గణపతి కాలనీలోని ఆలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు, కాలనీ పెద్దలు, భక్తులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు వరకాంతం నవీన్‌రెడ్డి మాట్లాడుతూ వినాయక చవితి అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చే పండుగ అన్నారు. కులమత భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంతో, సోదరభావంతో ఉత్సవాలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, ఆత్మీయత మరింత పెంపొందించడమే ఉత్సవాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో కాలనీలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని నవీన్‌రెడ్డి ఆకాంక్షించారు.

# నాంపల్లిలో పెన్షనర్ వినాయకుడు!




❖ *బాసేవకు గౌరవం.. పదవీ విరమణకు భరోసా..*
*వినూత్న థీమ్‌తో ఆకట్టుకుంటున్న మండపం.*

**దశ, హైదరాబాద్ :** ఉద్యోగుల జీవితకాల సేవకు గౌరవం, పదవీ విరమణ అనంతరం పెన్షన్‌తో లభించే ఆర్థిక భద్రతకు ప్రతీకగా నాంపల్లిలో ఏర్పాటు చేసిన 'పెన్షనర్ వినాయకుడు' విశేషంగా ఆకట్టుకుంటున్నాడు. నాంపల్లిలోని పెన్షన్ పేమెంట్ ఆఫీస్ (పీపీఓ) ప్రాంగణంలో జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ఈ వినూత్న మండపాన్ని ఏర్పాటు చేశారు. 'సేవ-పదవీ విరమణ-పెన్షన్-భద్రత-గౌరవప్రదమైన జీవితం' అనే సందేశాన్ని ప్రతిబింబించేలా మండపాన్ని తీర్చిదిద్దారు. ప్రజాసేవలో జీవితాన్ని అంకితం చేసిన పెన్షనర్ల సేవలను గౌరవిస్తూ ఈ ప్రత్యేక థీమ్‌ను రూపొందించారు. పెన్షనర్లకు ఆయురారోగ్యాలు, మానసిక ప్రశాంతత, ఆర్థిక సుస్థిరత కలగాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. వినూత్న ఆలోచనతో ఏర్పాటు చేసిన 'పెన్షనర్ వినాయకుడి'ని దర్శించేందుకు నగరవాసులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

## బఫర్ జోన్‌లో గోడ కూల్చివేత

❖ *ఫిర్యాదుపై ఇరిగేషన్ దూకుడు..*
*నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం గుర్తింపు*



**దశ, ఆదిభట్ల :** బఫర్ జోన్‌లో అక్రమంగా నిర్మించిన ప్రహరీ గోడపై ఇరిగేషన్ శాఖ కొరడా ఝుళిపించింది. రాందాస్‌పల్లిలోని తనరా వాలీ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో బఫర్ జోన్‌లో సుమారు 30 అడుగుల వెడల్పుతో 100 మీటర్ల మేర గోడ నిర్మించినట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు నిర్మాణం నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. గోడను తొలగించాలని వెంచర్ నిర్వాహకులను ఆదేశించడంతో రెండు రోజులుగా తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. బఫర్ జోన్‌లో నిర్మాణానికి అనుమతులు ఎలా వచ్చాయనే అంశంపైనా అధికారులు ఆరా తీస్తున్నారు. వెంచర్‌లోని ఇతర నిర్మాణాలపైనా పూర్తిస్థాయి పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.




# NEHSలో OPతో పాటు మెడికల్ రీయింబర్స్‌మెంట్ తప్పనిసరి చేయాలి

## ఉద్యోగులు-పెన్షనర్లకు సంపూర్ణ ఆరోగ్య భద్రత కల్పించాలి



- మహమ్మద్ ఉస్మాన్ పాషా

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన ఆరోగ్య భద్రత కల్పించాలనే లక్ష్యంతో అమలులోకి వచ్చిన NEHS (New Employees Health Scheme)లో నగదు రహిత వైద్యం, ఎంపానెల్డ్ ఆసుపత్రుల ద్వారా చికిత్స వంటి అంశాలు స్వాగతించదగినవి. అయితే పథకం క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా అమలయ్యేందుకు ఉద్యోగులు, ముఖ్యంగా పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి వారికి పూర్తి వైద్య భరోసా కల్పించాల్సిన అవసరం ఉంది**

### OP సేవలను విస్తరించాలి



వైద్య భద్రత అంటే ఆసుపత్రిలో చేరినప్పుడు అందించే చికిత్స మాత్రమే కాదు. వయస్సు పెరిగిన కొద్దీ మధుమేహం, రక్తపోటు, గుండె, కిడ్నీ, కంటి, కీళ్ల సంబంధిత సమస్యలకు తరచుగా వైద్యులను సంప్రదించడం, పరీక్షలు చేయించుకోవడం, మందులు తీసుకోవడం అవసరమవుతుంది. అందువల్ల Wellness Centresకే OP సేవలను పరిమితం చేయకుండా Network హాస్పిటల్స్ లలో కూడా Cashless OP Consultation, Specialist Consultation, Diagnostic Tests అందుబాటులోకి తీసుకురావాలి. ప్రధాన పట్టణాలతో పాటు ప్రతి జిల్లాలో పెన్షనర్లకు సులభంగా అందుబాటులో ఉండే OP వ్యవస్థను ఏర్పాటు చేయాలి.

### ఆధారిత కుటుంబ సభ్యుల హెల్త్ కార్డుల సమస్య పరిష్కరించాలి



పెన్షనర్లకు ప్రస్తుతం మరొక ముఖ్యమైన ఆందోళన ఉంది. పెన్షనర్‌పై ఆధారపడిన తల్లిదండ్రులు, అంగవైకల్యం గల పిల్లలు, ఆధారిత విధవరాలైన కుమార్తె, విడాకులు పొందిన ఆధారిత కుమార్తె వంటి అర్హుల వివరాలను హెల్త్ కార్డులో నమోదు చేసుకునే ప్రక్రియలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పెన్షనర్లు పేర్కొంటున్నారు. ముందుగా పెన్షనర్లు తమ వివరాలను అప్‌లోడ్ చేసుకొని హెల్త్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఆధారిత కుటుంబ సభ్యుల విషయంలో తరువాత స్పష్టత వస్తుందని అధికారులు సూచిస్తున్నారు. అయితే అప్పటివరకు ఆధారిత కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా తీవ్రమైన అనారోగ్యం వస్తే వారి పరిస్థితి ఏమిటన్నది పెన్షనర్ల ప్రధాన ఆందోళన.

### ఆరోగ్య సమస్య అధికారిక స్పష్టత వచ్చే వరకు వేచి ఉండదు కదా


NEHS కోసం పెన్షన్ నుంచి Contribution మినహాయింపు జరుగుతున్న సమయంలో అర్హులైన ఆధారిత కుటుంబ సభ్యులకు వైద్య భద్రత అందకపోవడం సముచితం కాదు. అందువల్ల శాశ్వత విధివిధానాలు ఖరారయ్యే వరకు పెన్షనర్ నుంచి Self-Declaration (స్వీయ ధ్రువీకరణ) తీసుకొని, నిబంధనల ప్రకారం అర్హులైన ఆధారిత కుటుంబ సభ్యులకు తాత్కాలికంగా NEHS వైద్యసేవలు అందేలా ప్రభుత్వం మధ్యంతర ఏర్పాట్లు చేయాలి. అనంతరం అవసరమైన పత్రాల పరిశీలన ద్వారా అర్హతను ఖరారు చేయవచ్చు.

### వైద్య పరిమితిని కనీసం ₹10 లక్షలకు పెంచాలి



ప్రస్తుతం వైద్య చికిత్సల ఖర్చులు గణనీయంగా పెరిగాయి. గుండె శస్త్రచికిత్సలు, క్యాన్సర్, కిడ్నీ, న్యూరో, ఆర్థోపెడిక్ వంటి తీవ్రమైన వ్యాధుల చికిత్సకు లక్షల్లో ఖర్చవుతోంది. NEHS కోసం ఉద్యోగులు, పెన్షనర్లు తమ Basic Pay/Basic Pension నుంచి Contribution చెల్లిస్తున్న నేపథ్యంలో, వారికి ప్రస్తుత వైద్య వ్యయాలకు అనుగుణమైన ఆర్థిక రక్షణ కల్పించాలి. అందువల్ల NEHS వైద్య పరిమితిని కనీసం ₹10 లక్షలకు పెంచాలనే ప్రతిపాదనను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలి. క్యాన్సర్, అవయవ మార్పిడి, గుండె, కిడ్నీ, న్యూరో వంటి అత్యంత ఖరీదైన చికిత్సలకు అవసరమైతే సాధారణ పరిమితికి మించి ప్రత్యేక రక్షణ కల్పించాలి.

### హెల్త్ కార్డు ఉంటే చికిత్స అందుతుందనే భరోసా కావాలి




హెల్త్ కార్డు చేతిలో ఉండటం ఒక్కటే ఆరోగ్య భద్రత కాదు. ఆ కార్డుతో ఎంపానెల్డ్ ఆసుపత్రికి వెళ్లినప్పుడు అవసరమైన చికిత్స నిరాటంకంగా అందుతుందనే నమ్మకం లబ్ధిదారుడికి ఉండాలి. కొన్ని ప్రాంతాల్లో NEHS కార్డుతో ఆసుపత్రికి వెళ్లిన ఉద్యోగులు, పెన్షనర్లు చికిత్స పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అనుభవాలు వినిపిస్తున్నాయి. దీనిని ఆసుపత్రులపై విమర్శగా కాకుండా, పథకం అమలులో పరిష్కరించాల్సిన ఆచరణాత్మక సమస్యగా చూడాలి.

Package Rates, Bills Settlement, Claims Clearance వంటి అంశాల్లో ఆసుపత్రులకు సమస్యలు ఉంటే ప్రభుత్వం వాటిని సకాలంలో పరిష్కరించాలి. అదే సమయంలో ఎంపానెల్డ్ ఆసుపత్రుల్లో లబ్ధిదారులకు చికిత్స నిరాకరణ ఎదురుకాకుండా స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలి. ఇప్పటివరకు ఒప్పంద ఆసుపత్రుల వివరాలు అధికారికంగా విడుదల కాకపోవడం పెన్షనర్లకు ఆందోళనకరంగా ఉంది

ప్రతి జిల్లాలో NEHS Help Deskను బలోపేతం చేసి, Cashless Approval లేదా చికిత్సకు సంబంధించిన సమస్య ఎదురైతే తక్షణ పరిష్కారం లభించేలా ప్రత్యేక grievance mechanism ఏర్పాటు చేయాలి.

### Medical Reimbursement రెండో రక్షణ కవచంగా ఉండాలి




Cashless Treatment ఉన్నంత మాత్రాన Medical Reimbursement అవసరం లేదని భావించకూడదు. అనారోగ్యం ముందుగా చెప్పి రాదు. అర్ధరాత్రి గుండెపోటు, ప్రమాదం లేదా మరో అత్యవసర పరిస్థితి ఎదురైతే కుటుంబ సభ్యుల మొదటి ప్రాధాన్యం రోగి ప్రాణాన్ని కాపాడటమే. ఆ సమయంలో ఆసుపత్రి NEHS Networkలో ఉందా, సంబంధిత చికిత్స Packageలో ఉందా, Cashless Approval వస్తుందా అనే విషయాలను పరిశీలించే అవకాశం ఉండకపోవచ్చు.

Network Hospital అందుబాటులో లేకపోయినా, అవసరమైన Specialist లేదా Treatment అక్కడ లేకపోయినా, సాంకేతిక కారణాలతో Cashless Approval రాకపోయినా రోగి సొంతంగా డబ్బు చెల్లించి చికిత్స పొందాల్సి రావచ్చు.

అటువంటి నిజమైన, అనివార్య పరిస్థితుల్లో నిబంధనల మేరకు Medical Reimbursement పొందే అవకాశం తప్పనిసరిగా ఉండాలి. Claims పరిష్కారానికి నిర్ణీత కాలపరిమితి విధించాలి. చిన్నపాటి పత్రాల లోపాలతో నిజమైన క్లెయిమ్‌లను తిరస్కరించకుండా వాటిని సరిచేసుకునే అవకాశం ఇవ్వాలి. Cashless Treatment మొదటి రక్షణ అయితే, Medical Reimbursement రెండో రక్షణ కవచంగా ఉండాలి.

### NEHSపై మరింత విశ్వాసం పెరగాలి



NEHSను విమర్శించడం ఈ చర్చ ఉద్దేశం కాదు. పథకంలోని మంచి అంశాలను కొనసాగిస్తూనే, క్షేత్రస్థాయిలో ఉద్యోగులు–పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడం ద్వారా దానిని మరింత బలోపేతం చేయడమే అవసరం.

ప్రత్యేకంగా ప్రభుత్వం ఐదు అంశాలపై దృష్టి పెట్టాలి .

OP సేవలను విస్తరించాలి — ఎంపానెల్డ్ ఆసుపత్రుల్లో చికిత్సకు పూర్తి భరోసా కల్పించాలి — ఆధారిత కుటుంబ సభ్యుల Health Cards సమస్యను తక్షణమే పరిష్కరించాలి — Medical Reimbursementను కొనసాగించాలి — వైద్య పరిమితిని కనీసం ₹10 లక్షలకు పెంచాలి. ఉద్యోగి లేదా పెన్షనర్ తన వంతు Contribution చెల్లిస్తున్నప్పుడు, అవసరమైన సమయంలో తనతో పాటు అర్హులైన ఆధారిత కుటుంబ సభ్యులకు కూడా వైద్యం అందుతుందనే భరోసా ఉండాలి.

**ప్రభుత్వ సేవలో జీవితంలోని విలువైన సంవత్సరాలను గడిపిన ఉద్యోగులు, పెన్షనర్లు అనారోగ్యం వచ్చినప్పుడు "ఏ ఆసుపత్రి చికిత్స చేస్తుంది? ఎంత ఖర్చవుతుంది? నా ఆధారిత కుటుంబ సభ్యుడికి వైద్యం అందుతుందా?" అనే ఆందోళనతో కాకుండా — "నా NEHS నాకు, నా కుటుంబానికి అండగా ఉంది" అనే భరోసాతో ఆసుపత్రికి వెళ్లగలిగే వ్యవస్థను నిర్మించడమే నిజమైన ఉద్యోగి–పెన్షనర్ సంక్షేమం.**

- మహమ్మద్ ఉస్మాన్ పాషా
అధ్యక్షులు, TSGREA
కరీంనగర్ జిల్లా శాఖ

# సూర్యాపేట పట్టణ బంద్ కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు

**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట పట్టణంలో శుక్రవారం జరిగిన బంద్ కు పూర్తిగా సహకరించిన వర్తక వ్యాపార వర్గాలకు , హోటల్స్ యజమానులకు మెకానిక్ లకు, లాయర్స్ కు బందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి బుల్లెట్ ట్రైన్ సాధన సమితి జేఏసీ ధన్యవాదాలు తెలిపింది. శనివారం సుధా బ్యాంకు ఆడిటోరియంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎండలను కూడా లెక్క చేయకుండా పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలు బందులో పాల్గొన్నారని తెలిపారు. సూర్యాపేట ప్రజల ఐకమత్యాన్ని ఈ బంద్ ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేశామని, బంద్ కు మద్దతుగా నిలిచిన పాఠశాల కళాశాలల యజమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉపాధ్యాయ సంఘాలు, బీసీ సంఘాలు, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు తెలియజేశారు. బంద్ లో బ్యాంకులు, కార్పొరేట్ సంస్థలు షాపింగ్ మాల్స్ కూడా స్వచ్ఛందంగా బంద్ లో పాల్గొన్నారని చెప్పారు. సూర్యాపేట బంద్ బుల్లెట్ ట్రైన్ సాధనలో ఒక కీలకమైన సంఘటన అని ఈ సందర్భంగా పలువురు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పెద్దిరెడ్డి రాజా, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మల్లు, నాగార్జున రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, మందాడి డేవిడ్, కొత్తపల్లి శివకుమార్, చల్లమల్ల నరసింహ, సలిగంటి వీరేంద్ర, ఎల్గూరి రామ్మూర్తి , కర్నాటి కిషన్, పెద్దిరెడ్డి గణేష్, బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కన్వీనర్ ఆరుట్ల జానకిరామిరెడ్డి, భూపతి రాములు తదితరులు పాల్గొన్నారు.



# అన్మోల్ రిష్తోం కా ఉత్సవ్'గా గ్రాండ్‌పేరెంట్స్ డే




**దశ, ఓయూ:** హైదరాబాద్ శంషాబాద్ ఏరోసిటీలోని ఢిల్లీలోని పబ్లిక్ స్కూల్ లో తాతయ్యలు-నానమ్మలు, అమ్మమ్మల దినోత్సవాన్ని అన్మోల్ రిష్తోం కా ఉత్సవ్' థీమ్‌తో ఘనంగా నిర్వహించారు. పిల్లల జీవితాల్లో తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు అందించే ప్రేమ, జ్ఞానం, మార్గదర్శకత్వం, మధుర జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఈ వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో క్లాస్ టీచర్ శ్రీదేవి, సంతోషి అతిథులకు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం వైస్ ప్రిన్సిపల్ రాధ తెలుగులో స్వాగత ప్రసంగం చేశారు. మేహా, మానస కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ పేరెంట్స్ వివిధ అంశాలను పరిచయం చేశారు. మిహిరా టీమ్ చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. రియాన్షి స్వాగత నృత్యంతో ఆకట్టుకుంది. సాన్వి చేసిన గ్రూప్ డ్యాన్స్ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేడుకలో నిర్వహించిన పాదపూజ కార్యక్రమం ప్రత్యేకంగా నిలిచింది. పిల్లలు తమ తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మల పట్ల ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను వ్యక్తం చేసి వారి ఆశీర్వాదాలను పొందారు. అనంతరం మీనాక్షి, మేరీ, శ్వేత, వారి బృందం నిర్వహించిన సరదా ఆటల్లో తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివర్లో వారు ఉత్సాహంగా నృత్యం చేయడంతో కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది. తాతయ్యలు-నానమ్మలు, అమ్మమ్మలు, మనవళ్లు-మనవరాళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత బలపరిచిన ఈ వేడుక ప్రేమ, గౌరవం, కృతజ్ఞత, కుటుంబ విలువలకు ప్రతీకగా నిలిచింది. శైలక్ష్మి, నందిని, సుష్మా మార్గదర్శకత్వం, పర్యవేక్షణలో కార్యక్రమాన్ని విజయవంతంగా జరిగింది.

# నాచారం ఎక్సైజ్ స్టేషన్ స్టేషన్ కొత్త ఇన్స్పెక్టర్గా బాలరాజ్ బాధ్యతలు!



**దశ, ఓయూ:** నాచారం ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్గా బాలరాజ్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్స్పెక్టర్గా పనిచేసిన ఓంకార్ గౌడ్ నాగర్ కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. పదోన్నతిపై నాచారం ఆబ్కారీ స్టేషన్ ఇన్స్పెక్టర్గా నియమితులై బాధ్యతలు స్వీకరించిన బాలరాజ్ వెంటనే స్టేషన్లో మౌలిక వసతుల కల్పన, నవీకరణ పనులపై దృష్టి సారించారు. కాగా, నాచారం ఆబ్కారీ స్టేషన్లో ఎస్సైలుగా పనిచేసిన నరేష్రెడ్డి, శ్రీనివాసులు కూడా బదిలీ అయ్యారు. వారి స్థానంలో సి.హెచ్. రాఘవేంద్ర, పి. శివకృష్ణలు నూతన ఎస్సైలుగా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఆబ్కారీ శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా అధికారులకు స్థానచలనం కలిగింది.

# ముదిరాజ్ ల బహిరంగ సభను విజయవంతం చేయాలి: చొక్కాల రాము ముదిరాజ్



**దశ, ఓయూ:** ముదిరాజ్‌లను బిసి డి నుంచి బీసీఏ లోకి మార్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న జిల్లాలో తలపెట్టిన ముదిరాజ్ ల బహిరంగ సభను విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము ముదిరాజ్ కోరారు. ఈ మేరకు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ముదిరాజ్‌లను బిసిడి నుంచి బి సి ఎ కి మారుస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తరతరాలుగా 6070 సంవత్సరాలుగా తమ పోరాటం కొనసాగుతోందని, ముదిరాజ్‌లు బుట్టలు అల్లుతూ, సీతాఫలాలు అమ్ముకుంటూ, చేపలు పడుతూ, చెట్లు ఎక్కుతూనే జీవనం సాగిస్తున్నారని, పేరుకే బిసిడి లో ఉన్నా ఏ ప్రభుత్వం నుంచి సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ రాజశేఖర రెడ్డి తమను గుర్తించి బిసి డి నుంచి బి సి ఎ కి మార్చడం జరిగిందని, అయితే కొంతమంది అడ్డుకోవడం వల్ల అది ఆగిపోయిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజులను బీసీ డి నుంచి బీసీఏలోకి మార్చాలని లేనిపక్షంలో మిలియన్ మార్చ్ చేపడతామని హెచ్చరించారు.

# మాణికేశ్వర్ నగర్‌లో 2 వేల మందికి అన్నప్రసాద వితరణ

❖ అన్నదాతలు గండికోట చంద్రకళ–శ్రీనివాస్ దంపతులు



**దశ, ఓయూ:** వినాయక చవితిని పురస్కరించుకుని మాణికేశ్వర్ నగర్‌లో గండికోట చంద్రకళ-శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2 వేల మందికి పైగా భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. ప్రతి ఏడాది వినాయక చవితి సందర్భంగా తమ కుటుంబం తరపున కోరుకున్న కోరిక నెరవేరిన అనంతరం అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తోందని చంద్రకళ-శ్రీనివాస్ దంపతులు తెలిపారు. ఈ ఏడాది మనవళ్లు, మనవరాళ్లు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నామని, కోరిక నెరవేరడంతో అన్నదానం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్, జి.నరేష్, జి.మణికంఠ, జి.పబ్లూ, శివనరేష్, రాము, ప్రేమ్, విజయ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రొ. గాలి వినోద్‌కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు



**దశ, ఓయూ:** దక్షిణ జనతా పార్టీ కోఆర్డినేటర్ ప్రొ. గాలి వినోద్‌కుమార్ జన్మదినం సందర్భంగా ఎన్‌సీసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బిషప్ మద్దెల సంజయ్ శనివారం ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మహావతార్ టీమ్ ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నవరాత్రి వేడుకలు



**దశ, ఓయూ:** మహావతార్ టీమ్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరుడిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి, నైవేద్యాలు సమర్పించారు. రాత్రివేళ చిన్నారులు ముత్యాల హారతులు చేస్తూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచారు. కార్యక్రమంలో వెంకటేష్‌చారి దంపతులతో పాటు కాలనీ మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.